సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 6 ၊ ఆగస్టు ၊ 2024



సోమశిలలో 12.055 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 12.055 టీఎంసీలు నిల్వ ఉండగా, 7,291 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువ కాలువలకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.71,740
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,425
3శాతం జీఎస్టీతో	రూ.6,518
సవర (8గ్రా)	రూ.52,144

గరిష్టం/కనిష్టం
34.8 /27.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. పగలు వాతావరణం వేడిగా ఉండనుంది. వాతావరణంలో తేమ 74 శాతం ఉంది.

చదువులు చట్టుబండలు

గాడి తప్పిన సర్కారు బడి

కూటమి ప్రభుత్వ పాలనలో సర్కార్ బడుల్లో చదువులు చట్టుబండలు అవుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందలేదు. యూనిఫాం కుట్టు చార్జీలు ఇంత వరకు తల్లుల ఖాతాల్లో జమ చేయలేదు. అనేక పాఠశాలల్లో నెలకొన్న సబ్జెక్ట్ టీచర్ల కొరతను తీర్చేందుకు 'సర్దుబాటు' ప్రక్రియ చేపట్టకపోవడంతో విద్యార్థులకు బోధన అందని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల నిర్వాహకులను టీడీపీ నేతలు మార్చేశారు. ఫలితంగా భోజనం రుచి మారింది. నీళ్ల చారు.. ఉడికీ ఉడకని అన్నంతో సరి పెట్టేస్తున్నారు. పాఠశాలల్లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల స్వల్ప మరమ్మతులనూ పట్టించుకోకపోవడంతో మూలన పడ్డాయి. పిల్లలను బడికి పంపించే తల్లులకు ఇచ్చే తల్లికి వందనంపై ఇంత వరకు స్పష్టత లేదు.

సర్దుబాటు చేయక...

140 మందికి ముగ్గురే ఉపాధ్యాయులు

నెల్లూరు నగరంలోని కిసాన్‌నగర్‌లో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో 140 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు టీచర్లు పని చేస్తున్నారు. మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో 1, 2 తరగతులకు కలిపి ఒకే టీచర్ బోధిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పలు పాఠశాలల్లో తాత్కాలికంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించింది. అయితే ఉపాధ్యాయులు విధుల్లోకి చేరకుండా టీడీపీ అడ్డుకోవడంతో ఇబ్బందులు తలెత్తాయి.

ఐదు తరగతులకు ఒకే టీచర్

నగరంలోని దీనదయాళ్‌నగర్‌లో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేస్తున్నారు. ఇక్కడ మొత్తం 125 మంది పిల్లలు చదువుతున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా ఒక టీచర్ సెలవుపై వెళ్లగా ఉన్న ఒక ప్రధానోపాధ్యాయురాలే అన్ని తరగతులను నిర్వహిస్తున్నారు.

250 మంది విద్యార్థులున్నా.. ఉర్దూ టీచర్ లేరు

నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో ఉన్న నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 700 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో 250 మంది ఉర్దూ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నారు. అయితే ఇప్పటి వరకూ ఉర్దూ సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఈ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

700 మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు

ఇదే పాఠశాలలో తెలుగు సబ్జెక్ట్‌ను బోధించేందుకు తెలుగు స్పెషల్ సబ్జెక్ట్‌కు ఒక ఉపాధ్యాయుడు, తెలుగు సబ్జెక్ట్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు మొత్తం ముగ్గురు ఉండాలి. అయితే ఒక్క ఉపాధ్యాయురాలే అతి కష్టంగా 700 మంది విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు ఇప్పటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఒకరు ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సబ్జెక్ట్‌కు కూడా 700 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడే బోధించాల్సి ఉంటుంది.

నవాబుపేట స్కూల్లో ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న విద్యార్థినులు





నెల్లూరు కేఎన్ఆర్ పాఠశాలలో ఆరుబయట చదువుతున్న యూనిఫాం లేని సగం మంది విద్యార్థులు



దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్ తరగతిలో యూనిఫాం లేకుండా ఉన్న విద్యార్థులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అందరూ ఊహించినట్లే కూటమి పాలనలో ప్రభుత్వ బడులు నిరాదరణకు గురవుతున్నాయి. నాణ్యమైన చదువులు అటకెక్కుతున్నాయి. మౌలిక వసతులు మూలన పడ్డాయి. విద్యార్థులకు అందించే ప్రోత్సాహాల ఊసేలేదు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత కొరవడింది. మొదటి నుంచి ప్రభుత్వ విద్యారంగం పురోగామిని వ్యతిరేకిస్తున్న కూటమి నేతలకు అధికారం చేజిక్కగానే విద్యా వ్యవస్థను గాలికి వదిలేశారు.

ప్రభుత్వ విద్యకు జగన్ సర్కార్ ప్రాధాన్యత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కార్ విద్యకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నాడు–నేడు పథకం ద్వారా శిథిలమైన ప్రభుత్వ బడులను సుందరంగా తీర్చిదిద్దారు. పేదింటి పిల్లలు చదువుకునే బడులను కార్పొరేట్ స్కూల్స్ కంటే మిన్నగా మౌలిక వసతులు సమకూర్చారు. కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా ఎదిగేందుకు ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టారు. సర్కారు బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక తోడ్పాటుకు అమ్మఒడి అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యాకానుక ద్వారా నాణ్యమైన స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, రెండు జతల సాక్సులు, వర్క్ బుక్స్ (ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు) ఇంగ్లిష్- తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (హైస్కూల్) పిక్టోరియల్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, మూడు జతల యూనిఫాం క్లాత్, బెల్టు, టై అందించింది. 8వ తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు, పాఠశాలల్లో డిజిటల్ విద్య, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ పరీక్ష, బైజూస్ ద్వారా బోధన వంటి వాటిని పకడ్బందీగా అమలు చేశారు. తాజాగా ఐబీ సిలబస్‌కు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రతి ఏటా విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి.

కొత్త ప్రభుత్వం టోఫెల్‌కు రాంరాం

ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న పేద పిల్లలకు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పెంపొందించేందుకు గత ప్రభుత్వం ఎంతో చొరవ తీసుకుని టోఫెల్ క్లాసులు ప్రవేశ పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్ కూడా కేటాయించింది. 3–5 తరగతుల పిల్లల కోసం టోఫెల్ ప్రైమరీ, 6–9 తరగతుల కోసం టోఫెల్ జూనియర్ క్లాసులు నిర్వహించి మార్చిలో పరీక్షలు కూడా జరిపించింది. కొత్త ప్రభుత్వం రాకతో టోఫెల్‌కు రాంరాం పలకడంతో పిల్లలకు ఇక ఇంగ్లిష్ ప్రావీణ్యం కొరవడే అవకాశం ఉంది.

ప్రోత్సాహాల సంగతి.. అంతే..!

గత ప్రభుత్వంలో 8వ తరగతి విద్యార్థుల నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ అందించేందుకు బైజూస్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ట్యాబ్‌లు అందించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్, బైజూస్ బోధనపై కానీ, ఈ ఏడాది 8వ తరగతిలోకి వచ్చిన విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీపై ఎటువంటి స్పష్టత లేదు. గత విద్యా సంవత్సరం వరకు పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేది. ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహాలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఉపాధ్యాయుల కొరతతో బోధనకు బ్రేక్

జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మించి ఉపాధ్యాయులు ఉన్నారు. దాదాపు 725 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత పట్టి పీడిస్తుంది. అయితే గత ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు 'సర్దుబాటు' ప్రక్రియను చేపట్టేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను పూర్తిగా పక్కన పడేసింది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. బడులు ప్రారంభించి 50 రోజులు పూర్తయినా చాలా పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కానుకలకు కొర్రీలు

కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో బడులు తెరిచి 50 రోజులు గడిచిపోతున్నా.. ఇంత వరకు చాలా చోట్ల ఇప్పటికీ విద్యాకానుకలు అందలేదని విద్యాశాఖాధికారులు చెబుతున్న మాటల్లోనే తేటతెల్లమవుతోంది. విద్యాకానుకకు సంబంధించి అన్ని రకాల వస్తువులను ఈ నెల 2వ తేదీ నాటికి దగదర్తి, ఉలవపాడు, అల్లూరు, బోగోలు మండలాల్లోని పాఠశాలలకు అందజేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి చెబుతున్నారు. గత ప్రభుత్వం బడి తెరిచిన రోజే విద్యాకానుకలు ఇస్తే.. ఈ ప్రభుత్వంలో ఇంకా.. ఇస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

యూనిఫాం కుట్టు చార్జీలు అంతే సంగతులు

విద్యార్థులకు అందజేసిన యూనిఫాం కుట్టు చార్జీలను గత ప్రభుత్వం వెంటనే తల్లి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికీ చాలా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం అందించలేదు. అందించిన వారికి కుట్టు చార్జీలు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో జూన్ నెలలోనే అమ్మఒడి పథకంతో పాటు విద్యార్థుల యూనిఫాం కుట్టు చార్జీలను కలిపి ఇచ్చేది.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు	- 2,021
ఉన్నత పాఠశాలలు	- 238
హైస్కూల్ ప్లస్	- 50
హైస్కూల్స్	- 283
మొత్తం	- 2,592

2023-24లో విద్యార్థులు - 1,92,369 మంది

2024-25లో విద్యార్థులు - 1,92,079 మంది

మధ్యాహ్న భోజనం.. నాణ్యతకు మంగళం

జిల్లాలోని 2,576 పాఠశాలల్లో 1,73,847 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. వీటిల్లో 2,288 పాఠశాలల్లో సెల్ఫ్ ఏజెన్సీలు, నెల్లూరు అర్బన్ ప్రాంతంలోని 91 స్కూల్స్‌ల్లో ఇస్కాన్ సంస్థ, వెంకటాచలం, మనుబోలు, ముత్తుకూరు మండలాల్లోని 204 పాఠశాలల్లో అక్షయ పాత్ర సంస్థ ద్వారా భోజనాన్ని అందిస్తున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి మధ్యాహ్న భోజనానికి రూ.5.88, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.8.57 అందజేస్తున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం నుంచి నాణ్యత లేని భోజనం వడ్డిస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఇళ్ల దగ్గర నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. సక్రమంగా మెనూ అమలు చేయడం లేదని, రుచి, నాణ్యత లేని భోజనం వడ్డిస్తున్నారని కొందరు ఉపాధ్యాయులే చెబుతున్న మాట. ఆయా పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి భోజనం తీసుకువచ్చి తింటున్నా, లెక్కల్లో మాత్రం పాఠశాలకు వచ్చిన విద్యార్థులందరూ తింటున్నట్లు నమోదు చేసుకుంటున్న పరిస్థితి ఉంది.

తాగునీటికి కటకట

జిల్లాలో తొలి విడతలో ఆయా పాఠశాలల్లో 641 ఆర్వో ప్లాంట్లు గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిల్లో ప్రస్తుతం 260 ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి బాటిళ్లతో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపట్టే విషయంలోనూ ప్రధానోపాధ్యాయుల నుంచి విద్యాశాఖాధికారుల వరకు పట్టించుకోవడం లేదు.

విద్యా కిట్‌లు ఆలస్యంగా పంపిణీ చేశారు



ఈ ఏడాది విద్యా కిట్‌లను ఆలస్యంగా పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా పాఠశాలల ప్రారంభానికి ముందే పంపిణీ చేసే వారు. పాఠ్య పుస్తకాలు సైతం ఆలస్యంగా అందాయి. యూనిఫారాలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల కుట్టించుకోవడం ఆలస్యమైంది. ఇంకా కుట్టు చార్జీలు కూడా ఇవ్వలేదు.

– వీరి అమరేంద్ర, ప్రభుత్వ పాఠశాల విద్యార్థి తండ్రి, నార్తురాజుపాళెం

ప్రారంభానికి ముందే ఇవ్వాలి



విద్యా కిట్‌లు గతంలో మాదిరిగా పాఠశాలల ప్రారంభానికి ముందే పంపిణీ చేస్తే విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. యూనిఫాం కూడా సిద్ధం చేసుకుని పాఠశాలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. ఆలస్యంగా ఇవ్వడం వల్ల ఇప్పటికీ యూనిఫాం కుట్టించ పరిస్థితి నెలకొంది.

– మండవ శ్రీలత, ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల తల్లి, కొడవలూరు


కుకింగ్ ఏజెన్సీల జోలికొస్తే ఊరుకోం



ఎందరో నిరుపేదలకు జీవనాధారంగా ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నేతలు తమ మద్దతుదారులకు కట్టబెట్టాలన్న ఆలోచన చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉన్న కుకింగ్ ఏజెన్సీలను రద్దు చేసేందుకు సిద్ధపడితే పార్టీ కార్యాలయాలు ముట్టడిస్తాం. ఈ నెల 8న పాఠశాలల్లో చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో వారిని తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. కుకింగ్ ఏజెన్సీల నిర్వాహకులకు గతంలో సక్రమంగా బిల్లులు చెల్లించని ఈనాటి ప్రభుత్వం అతి చేస్తోంది.

– షేక్ రెహనాబేగం, జిల్లా కార్యదర్శి, మిడ్ డే మీల్ యూనియన్

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. ఉపాధ్యాయులు లేకపోవడంతో సకాలంలో సిలబస్ పూర్తి కావడం లేదు. చెప్పింది విని ఇంటి దగ్గర చదివితే త్వరగా అర్థమవుతుంది. వెంటనే సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమించాలి. గతేడాది బోధనకు ఇబ్బంది లేకుండా ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయంగా నియమించారు.

– వీరంరెడ్డి మమత, 10వ తరగతి

అదనపు గదులను త్వరగా పూర్తి చేయాలి



కేఎన్నార్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు గదులు లేవు. అదనపు గదుల నిర్మాణం చేపట్టినా ఇంకా వాటిని పూర్తి చేయలేదు. వరండా, చెట్టు కింద తరగతులు నిర్వహిస్తున్నారు. బయట వాహనాలు, ఇతరులు చేసే శబ్దం వల్ల సరిగా వినపడక పోవడం, చదువుపై శ్రద్ధ కొరవడుతోంది. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదు.

– మల్లు మన్వితకృష్ణ, 9వ తరగతి



ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న యూనిఫాం కూడా లేని నవాబుపేట బీబీఎస్ స్కూల్ విద్యార్థులు



నవాబుపేట స్కూల్లో ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చి తన కుమారుడికి తినిపిస్తున్న తల్లి

తండ్రీకొడుకుల స్వార్థం.. రైతులకు శాపం

- యాష్‌పాండ్‌కు గండితో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడి స్వార్థానికి యాష్‌పాండ్‌కు గండిపడి రైతుల పొలాలు సర్వ నాశనం అయ్యాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీ జెన్‌కో యాష్ పాండ్ గండి పడి బూడిద నీరు పొలాల్లో, రొయ్యల గుంతల్లో చేరిన కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కాకాణి మీడియాతో మాట్లాడుతూ బూడిద కాలుష్యం వల్ల మత్స్యసంపద కోల్పోయి, జీవనాధారం కోల్పోయిన మత్స్యకారులకు జీవనభృతితో పాటు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం తప్పదని హెచ్చరించారు. సోమిరెడ్డి 2019 ఎన్నికలకు ముందు యాష్‌పాండ్‌కు టెండర్లు పిలిపించి, కాంట్రాక్టర్ దగ్గర డబ్బులు దండుకుని రైతుల ప్రయోజనాలకు గండికొట్టారన్నారు. యాష్ పాండ్ ప్రమాదానికి బూడిద పూడికతీత పనులకు సోమిరెడ్డి సృష్టించిన అడ్డంకే కారణమని విమర్శించారు. సోమిరెడ్డి, ఆయన కుమారుడు నెలకు 16 బల్కర్ల ద్వారా ఫ్లై యాష్ అక్రమ రవాణా చేస్తూ నెలకు రూ.16 లక్షలు గడిస్తున్నాడని ధ్వజమెత్తారు. తండ్రీకొడుకు సర్వేపల్లి ప్రజల క్షేమం కోసం సంచులు తీసుకుని తిరగడం మానుకోవాలని హితవు పలికారు. యాష్ పాండ్ ఘటనకు సంబంధించి ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూములు నష్టపోయిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతుందని, జెన్కో ఎండీలుగా పని చేసిన వారికి అనేక సార్లు తెలిపినా.. విడుదల చేయడం లేదని విమర్శించారు. నష్టపోయిన మత్స్యకారులు, రైతుల పక్షాన నిలబడి తాము రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కాకాణి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కాకాణి

కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. కనికరించండి

- పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల వెల్లువ


సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): 'సమస్యల పరిష్కారం కోసం పోలీసుస్టేషన్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. అయినా ఫలితం ఉండడం లేదు. మీరైనా పట్టించుకోండి' అంటూ బాధితులు ఉన్నతాధికారులను కోరారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 119 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌లకు అందజేశారు. వారు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని

- నెల్లూరు ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళ లోన్‌యాప్ వారు ఇబ్బంది పెడుతున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు.
- తాను పండించిన పసుపును గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన ఓ కంపెనీకి రూ.8 లక్షలకు విక్రయించగా, వారు నగదు ఇవ్వడం లేదని కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళేనికి చెందిన చెంచురెడ్డి ఫిర్యాదు చేశారు.
- ఓ ప్రముఖ గ్రూప్ ద్వారా రూ.12 కోట్ల విరాళం ఇప్పిస్తానని శ్రీనివాసులు, సాయి, అభినవ్, హరీష్‌రెడ్డి తమ వద్ద రూ.18 లక్షలు కాజేశారని ఎన్జీఓ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

సంతకాలు చేయాలంటున్నారు

700 పుట్ల ధాన్యాన్ని స్థానికంగా ఉన్న దళారులు తీసుకెళ్లారు. దీనికి సంబంధించి నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తగిన చర్యలు తీసుకోవాలని తోటపల్లిగూడూరు పోలీసులను ఆదేశించారు. వారిని సంప్రదించగా సమస్య పరిష్కారమైనట్లు సంతకాలు చేయమంటున్నారు. విచారించి న్యాయం చేయండి.

– తోటపల్లిగూడూరు గ్రామ కౌలు రైతులు

న్యాయం చేయండి

మా కుమారుడు సాయినాథ్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి నెల్లూరు నగరంలోని వెంకటరామపురంలో కంపెనీ పెట్టాడు. వారికి ఆర్థిక పరమైన విషయాల్లో విభేదాలు తలెత్తాయి. నా కుమారుడికి పెద్ద మొత్తంలో నగదు రావాల్సి ఉంది. అతను దైవదర్శన నిమిత్తం కర్ణాటక్‌కు వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నా కుమారుడికి రావల్సిన నగదు విషయాన్ని అతని స్నేహితులను అడగ్గా సమాధానం చెప్పకపోగా చంపుతామని బెదిరిస్తున్నారు. విచారించి న్యాయం చేయండి.

– శశికళ, వరప్రసాద్‌రెడ్డి దంపతులు

ఆస్తి కాజేయాలని ప్రయత్నిస్తున్నారు

నా ఆస్తిని భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాను. దానిని కాజేయాలని నా భార్యను నానుంచి ఆమె అక్క, కుమారుడు దూరం చేశారు. నా భార్య వద్ద 70 సవర్ల బంగారు ఆభరణాలున్నాయి. వాటిలో కొన్నింటిని కుదువపెట్టి నగదు కాజేశారు. మిగిలిన బంగారాన్ని కాజేయాలని చూస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మీనారాయణ, నెల్లూరు

చిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

- ఎఫ్ఏలు, వీఓఏల తదితరుల తొలగింపుపై కలెక్టరేట్ ఎదుట ధర్నా
- టీడీపీ ప్రభుత్వంపై సీఐటీయూ ఆగ్రహం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): 'అధికార పార్టీ నాయకులు చిరుద్యోగులపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలి. వారి జీవితాలతో ఆడుకోవడం మాని ఉద్యోగ భద్రత కల్పించాలి' అని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తిప్పిరెడ్డి ప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను, వెలుగు వీఓఏలను అక్రమంగా తొలగించి అధికార పార్టీ కార్యకర్తలను ఆయా పోస్టుల్లో పెట్టుకోవాలని చూడడం తెలుగుదేశం ప్రభుత్వానికి సబబు కాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరిని కారణం లేకుండా తొలగిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను రూ.2 లక్షలకు, వీఏఓ పోస్టులను అమ్ముకోవాలని టీడీపీ నేతలు చూడడం సిగ్గుచేటన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహానా బేగం, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్కీమ్ వర్కర్లకు, చిరుద్యోగులకు బాసటగా నిలుస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఇలా చేయడం దారుణమన్నారు. అధికార పార్టీ నాయకులు చేసే దౌర్జన్యాలకు ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు బాధ్యత వహించాల్సి వస్తుందని, వారిని కట్టడి చేసి ఫీల్డ్ అసిస్టెంట్లు, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.పెంచలనరసయ్య, విజయలక్ష్మి, అన్వర్, జి.నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, కె.సురేష్, గోగుల శ్రీనివాసులు, అత్తిమూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.70
సన్నవి : రూ.50
పండ్లు : రూ.40



క్లుప్తంగా

కాకాణి, ఆదాల భేటీ


సమావేశమైన మాజీ మంత్రులు

నెల్లూరు సిటీ: మాజీ మంత్రులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న ఆదాల క్యాంపు కార్యాలయంలో ఇద్దరూ కలిసి తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

ఎస్‌బీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీగా అత్తిన శ్రీనివాసరావు సోమవారం నగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు మిద్దె నాగేశ్వరమ్మ, జానీ, ఎస్సై సుబ్బారావు, సైబర్‌క్రైమ్ ఎస్సై సురేష్, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు 1991లో పోలీసుశాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి, బాపట్ల, నంద్యాల జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో నెల్లూరు ఎస్‌బీ డీఎస్పీగా నియమితులయ్యారు.

8న విద్యార్థుల ఎంపికలు

నెల్లూరు(టౌన్): ఇంటర్‌బోర్డు, హెచ్‌సీఎల్, టెక్‌బీ ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం విద్యార్థుల ఎంపికలు నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఈనెల 8న జరుగుతాయని ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు దీనికి అర్హులన్నారు. క్యాట్ పరీక్ష, కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఇందులో కూడా ఎంపికైన వారికి హెచ్‌సీఎల్ నుంచి టెక్‌బీ ప్రోగ్రాంలో చేరేందుకు ఆఫర్ లెటర్ ఇస్తారని వెల్లడించారు. టెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఏడాదిపాటు ఉంటుందన్నారు. తొలి మూడు నెలలు మధురైలో క్లాస్ రూం ట్రైనింగ్ ఇస్తారన్నారు. చివరి 9 నెలలు ఇంటర్న్‌షిప్ కోసం చెన్నై హెచ్‌సీఎల్ క్యాంపస్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఏడాదికి రూ.1.70 లక్షలు వేతనాన్ని ఇస్తారన్నారు. ఇతర వివరాలకు రాజ్‌కుమార్ (ఫోన్ నంబర్ 77803 23850)ను సంప్రదించాలన్నారు.

పోలీసుల అదుపులో లైబ్రేరియన్?

ఆత్మకూరురూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న పసుపులేటి శ్రీనివాసులును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. స్కూల్లో అతను అసభ్య చేష్టలు చేస్తున్నాడంటూ మహిళా టీచర్లు రెండు రోజుల క్రితం నిరసన తెలిపారు. అదే స్కూల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది ఇందిరమ్మ ఇంటికి అతను సోమవారం వెళ్లి ఆమె కుటుంబసభ్యులను తిట్టాడు. ఈ విషయాన్ని ఇందిరమ్మ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్నారని సమాచారం. ఎస్సై ముత్యాలరావు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు.

విన్నపాలు వినవలె..

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరులోని కలెక్టరేట్‌కు సోమవారం జనం, వివిధ సంస్థల ప్రతినిధులు పోటెత్తారు. జిల్లా రెవెన్యూ అధికారి లవన్న ఆధ్వర్యంలో తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చారు. డీఆర్వోతోపాటు జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి వినతిపత్రాలను స్వీకరించారు.

పూడికతీత పనులు చేపట్టాలి

సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. జలవనరుల శాఖ అధికారులు సంవత్సరానికి రూ.20 కోట్ల వ్యయం చేస్తున్నా పంట కాలువల్లో పూడిక అలానే ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం అవుతున్నాయే తప్ప చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి జిల్లాలో లేదన్నారు. జిల్లాలో మేజర్, మైనర్ చెరువులు, ఆ చెరువుల నుంచి సాగునీటి పంట కాలువల ద్వారా చివరి వరకు నీరు ప్రవహించే పరిస్థితులు లేవన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాణాలు పోతున్నాయి.. కాపాడండి

అనధికారికంగా తిరుగుతున్న సిమెంట్ ట్యాంకర్లు, భారీ వాహనాలతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయని సీపీఎం 16వ డివిజన్ శాఖ నాయకులు వినతిపత్రం అందజేశారు. చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు ప్రాంతంలో సిమెంట్ ట్యాంకర్లు, భారీ వాహనాలు, లారీలు తిరుగుతున్నాయన్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి జాతీయ రహదారి వైపు వెళ్లాల్సిన ఈ వాహనాలు అనుమతి లేకుండా నగరంలోని ముత్తుకూరుగేటు నుంచి చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని దీనికి తోడు అనుమతి లేని వాహనాలతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి భారీ వాహనాలకు నగరంలో ప్రవేశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

కృష్ణ, గోదావరి నది జలాల పంపిణీ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా వాదనలు వినిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రజాప్రతినిధులు కోరారు. అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి ఈనెల 15వ తేదీలోగా ఏపీ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించాల్సి ఉందన్నారు. ఈ అంశంపై స్పందించకుంటే మన నీటి హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ..

2007 నుంచి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తనకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాపూరు మండలం ఏపూరుకు చెందిన రేవూరు భాస్కర్ విన్నవించారు. తనపై ఎలాంటి రిమార్క్ లేదన్నారు. తాజాగా ప్రభుత్వం తనను పక్కనపెట్టి తాత్కాలికంగా మరో మనిషితో ఉపాధి పనులు జరిపిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ ప్రక్రియను అడ్డుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

మహిళ ఆత్మహత్య


ఆస్పత్రిలో శివకుమారి

జలదంకి: మండలంలోని గట్టుపల్లి పంచాయతీలో పొదుపు గ్రూపులో వీఓఏగా పనిచేస్తున్న సంతలూరి శివకుమారి (38) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. సోమవారం జలదంకి పోలీసులు వివరాలు వెల్లడించారు. శివకుమారి 9 సంవత్సరాలుగా వీఓఏగా పని చేస్తోంది. కరోనా కారణంగా ఆమె భర్త సంతలూరి మధు మృతిచెందాడు. కొంతకాలం ఒంటరిగానే ఉంది. తర్వాత ఓ వ్యక్తితో ఆమెకు స్నేహం ఏర్పడింది. శివకుమారి అతడికి అప్పులు చేసి మరీ నగదు ఇచ్చినట్లు చెబుతున్నారు. డబ్బు విషయమై ఆమె అడగ్గా అతను నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మనస్తాపానికి గురైన శివకుమారి శనివారం పురుగు మందు తాగింది. బంధువులు గుర్తించి ఆమెను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించగా పరిస్థితి విషమించడంతో చెన్నైకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతదేహాన్ని జలదంకి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కాగా బీసీజీ వ్యాక్సినేషన్


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): బీసీజీ వ్యాక్సినేషన్ పక్కాగా జరగాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆదేశించారు. నెల్లూరు చింతారెడ్డిపాళెం ఏరియాలోని రామాలయం వీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో వయోజనులకు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అలాగే ఇంటింటా జరుగుతున్న లెప్రసీ సర్వే గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా వయోజనులకు టీబీ టీకాను వేస్తున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వేయించుకుని టీబీ నుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హిమధర్, సూపర్‌వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు


కళాశాలను పరిశీలిస్తున్న వీసీ

వెంకటాచలం: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని జగన్స్, రావూస్ కళాశాలలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలల్లో వసతులు, విద్యార్థుల హాజరు, అధ్యాపకుల బోధన, ఇంటర్నల్ ఎగ్జామ్స్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వసతులు కల్పించడంలో కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ల్యాబ్‌లు, ఇతర సదుపాయాలు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీపై పరికరాలు

నెల్లూరు(అర్బన్): ఉద్యాన పంటల సాగుకు రాయితీపై పరికరాలు ఇస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 సంవత్సరానికి జిల్లాలో 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం కింద ఈ పథకాన్ని అమలు చేయనున్నామన్నారు. నిమ్మ, మామిడి, బత్తాయి, జామ, బొప్పాయి, మిరప, పుచ్చ, కూరగాయలు, పూలమొక్కలు లాంటి పంటలకు బిందు సేద్య పరికరాలను, వేరుశనగ, మినుము, పెసర, లాంటి పంటలకు తుంపర్ల సేద్య పరికరాలను రాయితీపై ఇస్తామన్నారు. ఐదెకరాల వరకు భూమిగల చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం కింద 90 శాతం, తుంపర్ల సేద్యం కింద 55 శాతం, 5 నుంచి 10 ఎకరాల భూమిగల ఇతర రైతులకు బిందు సేద్యం కింద 70 శాతం, తుంపర్ల సేద్యం కింద 45 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రం (వన్‌బీ) జత చేసి రైతు సేవా కేంద్రం కార్యాలయంలో ఉన్న వీఏఏ, వీహెచ్‌ఏను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు హెచ్‌టీటీపీ://హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. లేదా కొండాయపాళెం గేటు దగ్గర గల ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. 0861 – 2315779 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 100
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 190
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 210
లేయర్ చికెన్	: 153

ఫీజు చెల్లించాలి : డీఈఓ

నెల్లూరు(టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం వచ్చేనెల 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, రూ.3.50 లక్షల్లోపు ఆదాయం ఉన్న విద్యార్థులు ఈ ఎగ్జామ్ రాసేందుకు అర్హులన్నారు. పరీక్ష డిసెంబర్ 8న జరుగుతుందన్నారు. రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలని తెలియజేశారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్ నేడు

పొదలకూరు: నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు సబ్‌డివిజన్లకు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ మంగళవారం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), ఆర్థిక సభ్యులు రామ మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మ హాజరవుతారని తెలియజేశారు. పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా అదాలత్‌లో పాల్గొంటారన్నారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు.